

జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | 25 | ఏప్రిల్ | 2026 ◆ పేజీలు : 7

# నైపుణ్యాభివృద్ధితో యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు

- ప్రభుత్వ పథకాలతో స్వయం ఉపాధి సాధించి ఆర్థిక స్వావలంబన సాధించాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్




**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 24, (ప్రజాజ్యోతి)** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం

మిగతా 2 లో...




# ర్యాంకుల వేటలో బలవుతున్న బాల్యం...
# కార్పొరేట్ బ'కాసు'రుల కక్కుర్తి

- ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..!
- ప్రభుత్వ ఉపాధ్యాయుల పిల్లలు కూడా ప్రైవేటు వైపే.
- ర్యాంకుల వేటలో బాల్యం బలి.
- ఫలితాలు రాకముందే అడ్మిషన్లు.
- అధిక ఫీజుల పై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం.

6 లో..



నేటి విద్యా వ్యవస్థలో విద్యార్థుల భవిష్యత్తు కంటే ర్యాంకులే పరమావధిగా మారుతున్నాయి. ముఖ్యంగా కార్పొరేట్ కళాశాలల తీరుపై సర్వత్రా ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. విద్యను వ్యాపారంగా మార్చి, విద్యార్థులను కేవలం 'ర్యాంకులు ఇచ్చే యంత్రాలు'గా చూస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు విధ్యార్థులతో కళకళలాడుతూ ఉండేవి. కానీ నేటి తీరు పూర్తి బిన్నంగా కనపడుతోందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ, ప్రభుత్వం ఇచ్చే జీతం తీసుకుంటూ వారి పిల్లలని మాత్రం ప్రైవేటు కళాశాలల్లో చదివిస్తున్నారంటే అతిశయోక్తి కాదు.

● పాల్వంచ, ప్రజాజ్యోతి

# మన జనగణన - మన అభివృద్ధి" పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 24, (ప్రజాజ్యోతి)** "మన జనగణన – మన అభివృద్ధి" కార్యక్రమానికి సంబంధించి రూపొందించిన అవగాహన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జనగణన ద్వారా సేకరించే వివరాలు ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతుల అభివృద్ధి వంటి రంగాల్లో సరైన ప్రణాళికలు రూపొందించడానికి ఖచ్చితమైన సమాచారం అవసరమని అన్నారు, ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు నిర్వహించే సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. ఇందు కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని శాఖల జిల్లా అధికారులు తమ పరిధిలోని జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో ఉన్న ఉద్యోగులు సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియలో పాల్గొనేలా సమగ్ర చర్యలు తీసుకోవాలని అన్నారు . పంచాయతీ శాఖ, మున్సిపల్ శాఖ, డిఆర్డిఓ, వ్యవసాయ శాఖ, వైద్యశాఖ, పంచాయతీ రాజ్ తదితర అన్ని శాఖలు తమ పరిధిలోని ప్రతి ఉద్యోగి ఈ ప్రక్రియలో భాగస్వామ్యులు అయ్యేలా ప్రత్యేక

మిగతా 2 లో...

# నిరుద్యోగ యువత వచ్చిన అవకాశంను సద్వినియోగం చేసుకోవాలి

- - భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్



**భద్రాచలం టౌన్ , ఏప్రిల్ 24 , ప్రజాజ్యోతి,** నిరుద్యోగులైన గిరిజన యువతీ యువకులు పై స్థాయి వరకు చదువుకొని ఇంటిపట్టునే ఉండి ఖాళీగా ఉండకుండా అంది వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకొని జీవనోపాధికి వెసులుబాటు కల్పించుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. శుక్రవారం ఐటిడిఏ ప్రాంగణంలోని వైటీసీలో ఏర్పాటుచేసిన ప్రజా పాలన

మిగతా 2 లో...

# వేసవిలో త్రాగునీటి సరఫరా నిరంతరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి

- కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సదుపాయాలు కల్పించాలి
- 99 రోజుల కార్యాచరణలో భాగంగా 'సే నో టు డ్రగ్స్' కార్యక్రమాలు విజయవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 24,(ప్రజా జ్యోతి)** జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు, త్రాగునీటి సమస్యలపై వ్యవసాయ శాఖ, పౌరసరఫరాల శాఖ, పంచాయతీ రాజ్ & గ్రామీణ అభివృద్ధి తదితర సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్టతో కలిసి శుక్రవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు వివరాలు, కొనుగోలు ప్రక్రియలో తలెత్తుతున్న సమస్యలపై అధికారుల నుండి వివరణ తీసుకున్నారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, షెడ్లు, తూకం యంత్రాలు, రవాణా సదుపాయాలు వంటి అన్ని మౌలిక సదుపాయాలు సమకూర్చాలని ఆదేశించారు. మండల ప్రత్యేక

మిగతా 2 లో...

## మన జనగణన _ మన అభివృద్ధి" పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ అంకిత్

(మొదటి పేజీ తరువాయి...)

దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఉద్యోగి తన కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకోవడం ద్వారా సమగ్ర గణాంకాల సేకరణకు తోడ్పడాలని సూచించారు. జనగణన ప్రక్రియలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాల్గొని ఖచ్చితమైన వివరాలు అందించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సి పి ఓ సంజీవ రావు,సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వేసవిలో త్రాగునీటి సరఫరా నిరంతరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి



(మొదటి పేజీ తరువాయి...)

అధికారులు తమ పరిధిలోని కొనుగోలు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించి కొనుగోలు ప్రక్రియలో ఆటంకాలు రాకుండా చూడాలని సూచించారు. వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా వ్యాప్తంగా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడైనా నీటి సరఫరాలో అంతరాయం కలిగితే తక్షణమే పరిష్కారం చూపడం, లేదా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి నిరంతరంగా తాగునీరు అందేలా చూడాలని సూచించారు. టేకులపల్లి ప్రాంతంలో త్రాగునీటి సమస్య తమ దృష్టికి వచ్చిందని, వెంటనే సమస్యను పరిష్కరించి సరఫరా పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణ కింద సోమవారం నుండి మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న చైల్డ్ సేఫ్టీ, ప్రొటెక్షన్, "సే నో టు డ్రగ్స్" కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై గ్రామ, వార్డు స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ నిరంతర పర్యవేక్షణ చేయాలని, యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడేందుకు , మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే విద్యార్థులు, గర్భిణీలు, చిన్నారుల కోసం ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం, సీజనల్ వ్యాధుల నివారణకు ఫాగింగ్, పరిసరాల పరిశుభ్రత పనులు చేపట్టడం, పెండింగ్ ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించడం వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి , సిపిఓ సంజీవరావు, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లెనినా, పంచాయతీ అధికారి సుధీర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో అన్న ప్రసన్న కార్యక్రమం



**టేకులపల్లి, ఏప్రిల్ 24, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం బద్దు తండ గ్రామంలోని అంగన్వాడి సెంటర్లో సుజాత, తుమ్మల చేలక ఎంపిపిఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాదావత్ పుల్సింగ్ అధ్యర్యం లోఆరు నెలల పిల్లలకు అన్న ప్రసన్న కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బద్దుతండ సర్పంచ్ బానోత్ నరేష్ పాల్గొన్ని మాట్లాడుతు ఆరు నెలలు పైబడిన పిల్లలకు అన్నప్రసన్న కార్యక్రమం ప్రభుత్వం నిర్ణయించడం ఎంతో మహోన్నతమైన పని అయన పేర్కొన్నారు.గర్భిణీ అయిన ప్రతి మహిళా అంగన్వాడి కేంద్రంలో పేరు నమోదు చేసుకోవాలని అయన కోరారు. అదే విధంగా అంగన్వాడి కేంద్రంలో లభించే అన్ని సౌకర్యాలు ఉపయోగించికొని అంగన్వాడి టీచర్ చెప్పే ఆరోగ్య సూత్రాలు తూచా తప్పకుండా పాటించినపుడే తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కాంతరావు, భూక్య నైజాం, గర్భిణీ స్త్రీలు, తల్లులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# నైపుణ్యాభివృద్ధితో యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు






(మొదటి పేజీ తరువాయి...)

నిర్వహిస్తున్న సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా పాల్వంచలో శుక్రవారం నవ ఒకేషనల్ లో నైపుణ్యాభివృద్ధి అవగాహన కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ కేంద్రంలో జరుగుతున్న కార్యకలాపాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పొందుతున్న మహిళలు, పురుషులతో కలెక్టర్ ప్రత్యక్షంగా మట్లాడి వారికి అందుతున్న శిక్షణ నాణ్యత, శిక్షణ కాలవ్యవధి, శిక్షణ అనంతర ఉపాధి అవకాశాలు, ఉత్పత్తుల మార్కెటింగ్ విధానాలు, ఆదాయ సాధన అవకాశాలపై వివరాలు తెలుసుకున్నారు. శిక్షణార్థుల అభిప్రాయాలను తెలుసుకుని, శిక్షణను మరింత ఫలప్రదంగా నిర్వహించేలా సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా 2010 లో స్థాపించబడిన "నవ భారత్ వొకేషనల్ ఇనిస్టిట్యూట్" ద్వారా పరిసర ప్రాంతాల పేద యువతకు వెల్డింగ్, ఎలక్ట్రికల్, ఫిట్టర్, సోలార్ టెక్నీషియన్ వంటి వృత్తి విద్యా కోర్సుల్లో నాణ్యమైన ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు అధికారులు వివరించారు. ఇప్పటివరకు 2200 మందికి స్టైఫండ్‌తో కూడిన శిక్షణ అందించగా, ప్రస్తుత సంవత్సరంలో 80 మందికి శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించామని తెలిపారు. శిక్షణ పొందిన అభ్యర్థులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమలతో పాటు ప్రైవేటు సంస్థల్లో, అలాగే విదేశాల్లో కూడా ఉపాధి పొందడం గర్వకారణమని కలెక్టర్ అన్నారు . కొంత మంది స్వయం ఉపాధి ద్వారా తమ జీవనోపాధిని స్థిరపరచుకోవడం ప్రోత్సాహకరమని అన్నారు. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో వృత్తి విద్యకు ఉన్న ప్రాధాన్యతను యువత సరిగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సంప్రదాయ విద్యతో పాటు వృత్తి నైపుణ్యాలు కలిగి ఉంటేనే ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని తెలిపారు. కేవలం డిగ్రీలు పొందడం సరిపోదని, ఉద్యోగ రంగం అవసరాలకు అనుగుణంగా ప్రాక్టికల్ స్కిల్స్‌ను అభ్యసించడం అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. ప్రస్తుతం పరిశ్రమలు, సర్వీస్ రంగాలు నైపుణ్యంతో కూడిన సిబ్బందిని కోరుకుంటున్నాయని, వెల్డింగ్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, ఫిట్టింగ్, సోలార్ టెక్నాలజీ, మెషిన్ ఆపరేషన్, డిజిటల్ సర్వీసులు వంటి రంగాల్లో శిక్షణ పొందిన వారికి మంచి డిమాండ్ ఉందన్నారు. ఈ కోర్సులు తక్కువ కాలంలో నేర్చుకునే వీలుతో పాటు త్వరగా ఉపాధి పొందే అవకాశం కల్పిస్తాయని తెలిపారు. వృత్తి విద్య కేవలం ఉద్యోగాలకు మాత్రమే పరిమితం కాకుండా స్వయం ఉపాధికి కూడా బలమైన మార్గం చూపుతుందని అన్నారు. శిక్షణ పొందిన యువత చిన్న స్థాయిలో యూనిట్లు ప్రారంభించి క్రమంగా వ్యాపారాలను విస్తరించుకోవచ్చని, దీనివల్ల ఇతరులకు కూడా ఉపాధి అవకాశాలు సృష్టించవచ్చని . ప్రపంచ స్థాయిలో జపాన్, రష్యా వంటి దేశాలు వృత్తి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ పారిశ్రామిక అభివృద్ధి సాధిస్తున్నాయని, అదే విధంగా మన దేశంలో కూడా నైపుణ్యాభివృద్ధి ద్వారా ఆర్థిక పురోగతిని సాధించవచ్చని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ పథకాలను యువత పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలు, పథకాలను సమర్థవంతంగా వినియోగించుకుని యువత స్వయం ఉపాధి సాధించి ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. చేతివృత్తులకు గౌరవం పెంచుకుని చిన్న స్థాయిలో ప్రారంభించిన వ్యాపారాలను క్రమంగా అభివృద్ధి చేసుకుంటే మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక సదుపాయాలతో ఏటీసీ కేంద్రాల ద్వారా వృత్తి విద్యా కోర్సుల్లో నైపుణ్యం సాధించేలా విస్తృత కార్యక్రమాలు చేపడుతోందని, సంప్రదాయ కోర్సులతో పాటు సోలార్ ఎనర్జీ, డిజిటల్ టెక్నాలజీ, ఆధునిక సాంకేతిక రంగాల్లో శిక్షణ పొందడం ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు పొందవచ్చని సూచించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు కలెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు ప్రదానం చేయడంతో పాటు, చేతివృత్తుల ద్వారా గత నెలలో సాధించిన ఆదాయానికి గుర్తింపుగా చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఓ సంజీవరావు, తహసీల్దార్ ధారా ప్రసాద్, నవ భారత్ వొకేషనల్ ఇనిస్టిట్యూట్ హెచ్ఆర్ శ్రీనివాసరెడ్డి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి శ్రీలత, బీసీ సంక్షేమ శాఖ అధికారి విజయలక్ష్మి , ఎస్సీ కార్పొరేషన్ అధికారి ఉపేందర్, ఏపీఎం వెంకయ్య, మహిళా సాధికారిక ప్రతినిధులు, నవ ఒకేషనల్ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువత వచ్చిన అవకాశంను సద్వినియోగం చేసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి...)

ప్రగతి ప్రణాళికలో భాగంగా గిరిజన నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి యువతి, యువకులు చెడు భావాలను మనసులో నుండి తీసేసి మార్పు చెంది వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలని, వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకొని ముందుకు పోతున్న దేశాలలో చైనా, జపాన్ ,దక్షిణ కొరియా దేశాలు ముందుకు పోతున్నాయని, ప్రపంచ దేశాలకు పోటీపడి మనం కూడా ముందుకు పోవాలన్నారు. పీజీ, బీటెక్, చేసిన యువతీ, యువకులు స్కిల్ డెవలప్మెంట్ పెంపొందించుకొని వివిధ ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో పనిచేస్తూ జీవనోపాధి కల్పించుకుంటున్నారని, ప్రభుత్వ ఉద్యోగం అనేది ఈ పోటీ ప్రపంచంలో సాధించాలంటే ఎంతో శ్రమించాలని,



అందుకు ప్రతి ఒక్కరు ఐటీడీఏ భవిత సెల్ ద్వారా నిర్వహించే వివిధ రకాల వృత్తి శిక్షణలో తర్ఫీదు పొంది శిక్షణ తీసుకొని స్వయం ఉపాధి ద్వారా జీవనోపాధి పొంది ఆర్థిక వెసులు బాటు కల్పించుకోవాలన్నారు. వివిధ కోర్సులలో చేరడానికి అవగాహనకు వచ్చిన ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా అవకాశం కల్పిస్తామని దానిని సద్వినియోగం చేసుకొని జీవనోపాధి పొందాలని ఆయన అన్నారు. ఈసారి గుర్తింపు పొందిన సంస్థల ద్వారానే శిక్షణ ఇప్పించడం జరుగుతుందని, శిక్షణ తీసుకునే గిరిజన యువతి యువకులు వీరికి శిక్షణానంతరం ప్రైవేటు కంపెనీలలో పనిచేస్తామని ఒప్పంద పత్రం రాసి ఇచ్చిన వారికి మాత్రమే అవకాశం కల్పిస్తున్నామని అన్నారు. పలు కోర్సులలో శిక్షణ తీసుకోవడానికి 170 మంది యువతీ యువకులు పాల్గొన్నారని, ఐటి హెల్ప్ డెస్క్ అటెండెంట్ కోర్సు కు 45 మంది, జూనియర్ సాఫ్ట్వేర్ డెవలపర్ కోర్సు కు 8 మంది, ఎంబ్రాయిడరి మిషన్ ఆపరేటర్ కోర్సుకు 20 మంది, డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు 35 మంది, టైలరింగ్ మిషన్ ఆపరేటర్ కోర్సుకు 52 మంది, మిగతా కోర్సులకు పది మంది శిక్షణ తీసుకోవడానికి ముందుకు వచ్చారన్నారు. ఈ శిక్షణ మూడు నుండి ఆరు నెలల పాటు ఉంటుందని, ఈ తీసుకుంటున్న యువతీ యువకులకు ఉచిత భోజన, వసతి కల్పిస్తున్నందున తప్పనిసరిగా గిరిజన యువతి యువకులు మీకు నచ్చిన కోర్సులలో శ్రద్ధగా శిక్షణ తీసుకొని స్వయం ఉపాధి ద్వారా జీవనోపాధి కల్పించు కోవాలని ఆయన అన్నారు. అంతకుముందు భద్రాచలం సర్పంచ్ వివిధ కోర్సులలో శిక్షణ తీసుకోవడానికి వచ్చిన గిరిజన యువతి యువకులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారి అశోక్, ఏవో సున్నం రాంబాబు, జేడీఎం హరికృష్ణ, వై టి సి సెంటర్ ఇన్చార్జి శ్రీను, భవిత సెల్ సిబ్బంది సమ్మయ్య, మణిదీప్, దీన కుమారి, అనురాధ, అభిరామ్, గిరిజన యువతి యువకులు పాల్గొన్నారు.

# వడ్ల కొనుగోళ్లలో జాప్యంపై రైతుల ఆందోళన

- సీతారామ ప్రాజెక్టు బ్రిడ్జి వద్ద జాతీయ రహదారిపై ధాన్యం పోసి నిరసన
- తహసీల్దార్ హామీతో విరమించిన రైతులు





**అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 24, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన రైతులు వడ్ల కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందని ఆరోపిస్తూ శుక్రవారం కట్టుగూడెం సీతారామ ప్రాజెక్టు బ్రిడ్జి వద్ద విజయవాడ–జగదల్పూర్ జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. ధాన్యాన్ని రోడ్డుపై పోసి తమ నిరసన వ్యక్తం చేశారు.రైతులు మాట్లాడుతూ ఎంతో కష్టపడి పండించిన పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చినా అధికారులు వెంటనే కొనుగోలు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని, అప్పుల భారం పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.బి ఆర్ ఎస్ నాయకుడు వేముల హరీష్ రావు మాట్లాడుతూ రైతు సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రైతు సంక్షేమ పథకాల అమలులో స్పష్టత లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారని అన్నారు. వెంటనే వడ్లు కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.రైతుల నిరసన విషయం తెలిసిన మండల తహసీల్దార్ స్వర్ణ సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. ధాన్యాన్ని సంబంధిత మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో బోయినపల్లి సుధాకర్, వేముల హరీష్ రావుతో పాటు పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

## సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



**ఇల్లందు, ఏప్రిల్ 24, ప్రజాజ్యోతి:** వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతిని తెలంగాణ ప్రభుత్వం అధికారిక పండుగగా ప్రకటిస్తూ జి.ఓ విడుదల చేయడాన్ని హర్షిస్తూ శుక్రవారం ఇల్లందులో ఆర్యవైశ్య సత్రం పునర్నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య కళ్యాణ మండపం (ఆర్యవైశ్య సత్రం )లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి యెలుగూరి నగేష్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వాసవి భక్తులకు గౌరవప్రదమని, ఆర్యవైశ్య సమాజానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లెర్ల చంద్రశేఖర్, రాష్ట్ర నాయకులు కటకం బాలకృష్ణ, పసుమర్తి శ్రీనివాస్, వాసవి క్లబ్ జోన్ చైర్మన్ బోనగిరి రవికిరణ్, వాసవి క్లబ్ పట్టణ అధ్యక్ష,కార్యదర్శులు కటకం సత్యేందర్, తీర్థాల నాగరాజు, వాసవియన్ జొన్నల ఉపేంద్రనాథ్, గ్రంథసిరి నరేందర్ పాల్గొన్నారు.

## ఆధునిక కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు





**చర్ల, ఏప్రిల్ 24: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శుక్రవారం విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలనే లక్ష్యంతో చర్లలోని రాహుల్ విజ్ఞాన్ విద్యాలయం ప్రాంగణంలో అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు ల్యాబ్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ, మారుమూల ప్రాంతమైన చర్లలో ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న రాహుల్ విజ్ఞాన్ విద్యాలయాన్ని అభినందించారు. పాఠశాల వ్యవస్థాపకులు డాక్టర్ డి.ఎన్. కుమార్ పేద ప్రజల కోసం నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలు, విద్యారంగంలో చేస్తున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు.ప్రస్తుతం డిజిటల్ యుగంలో కంప్యూటర్ విద్యకు అత్యంత ప్రాధాన్యం ఉందని, విద్యార్థులకు చిన్ననాటి నుంచే సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవడం అవసరమని ఆయన పేర్కొన్నారు. కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.కార్యక్రమం ముగింపులో అతిథులను శాలువాతో సత్కరించి, పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ జి. వర్మ రాజు, వైస్ ప్రిన్సిపల్ ఎం.వి.ఎల్ నరసింహారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి రహదారికి సైడ్ మార్జిన్ తప్పనిసరి: ఎంపీవో వెంకటేశ్వరరావు




**పినపాక,ఏప్రిల్ 24(ప్రజాజ్యోతి ):** పినపాక మండలంలో గ్రామీణ రహదారుల అభివృద్ధిపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రతి రహదారికి సైడ్ మార్జిన్ తప్పనిసరిగా ఉండాలని ఎంపీవో వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పలు రహదారులకు సైడ్ మార్జిన్ లేకపోవడంతో సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తేజస్విని, డిప్యూటీ తహసిల్దార్ గోపాలకృష్ణతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం పలు రహదారులను పరిశీలించి, సైడ్ మార్జిన్ కల్పనపై చర్చించారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులతో సమావేశమై సమస్యలపై చర్చించారు. గ్రామాల్లో రహదారులు సురక్షితంగా, దీర్ఘకాలికంగా ఉండేందుకు సైడ్ మార్జిన్ కీలకమని అధికారులు పేర్కొన్నారు. పనులు నాణ్యతగా, నిబంధనల ప్రకారం పూర్తిచేయాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు.

## ఆర్టీసీ సమ్మెకు ఎంహెచ్‌పీఎస్ మద్దతు

- ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



**కొత్తగూడెం, ఏప్రిల్ 24 ( ప్రజాజ్యోతి )** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొనసాగుతున్న ఆర్టీసీ సమ్మెకు ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాతంగి సంతోష్ ఘన మద్దతు ప్రకటించారు. ఆర్టీసీ కార్మికులు తమ హక్కుల కోసం చేస్తున్న సమ్మె న్యాయ సమ్మతమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పట్టించుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఉద్యోగుల ఇబ్బందులను గుర్తించకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. ఆర్టీసీని బలహీనపరచే చర్యలను తమ సంఘం సహించబోదని హెచ్చరించారు. సమ్మెకు పూర్తి స్థాయిలో అండగా ఉంటామని అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉందని హెచ్చరించారు.

## ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం



**చర్ల ,ఏప్రిల్ 25: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శుక్రవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్.కొత్తగూడెం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో సమావేశంనిర్వహించారు.గ్రామపంచాయతీల సక్రమ నిర్వహణే దేశ ప్రగతికి సూచిక అని సర్పంచ్ తుర్రం రవి కుమార్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల బుచ్చిబాబు మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధికి పంచాయతీరాజ్ వ్యవస్థ పునాదిగా నిలుస్తుందని తెలిపారు. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా గ్రామ పాలనకు బలమైన చట్టపరమైన ఆధారం లభించిందని వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారం, పారదర్శక పాలన గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని అన్నారు.ఈ సమావేశంలో గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ తుర్రం రవి కుమార్, పంచాయతీ కార్యదర్శి శోభ రాణి, ఉప సర్పంచ్ కాపుల కృష్ణ అర్జునరావు, ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల రమేష్ బాబు, జోగి రాజు, కొమరంభద్రయ్య, చింతకాయల రవీంద్ర, కనితి రజిని, దల్లి రామ్ రెడ్డి, గొరస పవన్ చారి, లంక సాగర్, వేల్పుల కామయ్య, చిమిడి సాంబయ్య, కరుకు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## దేవస్థానం నిత్యన్నదాన పథకంకు రూ.58 వేలు విరాళం



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 24, ప్రజాజ్యోతి,** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం నిత్యన్నదాన పథకంకు ఏపీలోని విశాఖపట్నంకు చెందిన సుమశ్రీ హంసిత మత్స, వారి కుటుంబ సభ్యులు రూ.58,000 విరాళంగా అందజేశారు. ముందుగా వారు ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిత్యన్నదాన పథకంకు విరాళంను రామాలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబాకు అందజేశారు.

## భద్రాచలంలో నల్లబ్యాడ్జీలతో ఆర్టీసీ కార్మికుల నిరసన ర్యాలీ

- డిపో గేట్ ఎదుట నిరసన



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 24, ప్రజాజ్యోతి,** భద్రాచలంలో శుక్రవారం ఆర్టీసీ కార్మికులు జేఏసీ ఆద్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ఆర్టీసీ బస్టాండు నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ సాగింది. అలాగే ఆర్టీసీ డిపో ఎదుట ఉద్యోగులు మృతి చెందిన నర్సంపేట ఆర్టీసీ డ్రైవర్ శంకర్‌గౌడ్ మృతికి నివాళ్లర్పించడంతో పాటు కొద్దిసేపు మౌనం పాటించారు. ప్రభుత్వ వైఖరిపై నిరసన తెలిపారు. అలాగే సమ్మె శిబిరం వద్ద ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు శంకర్‌గౌడ్ మృతికి నివాళ్లర్పించారు. ఈఆర్యక్రమాల్లో జేఏసీ చైర్మన్ బరల రమణారావు, కేకే ప్రసాద్, యాకయ్య, ఎంఎస్రావు, జున్ను రవి, పోకల సురేష్, మహిళ కండక్టర్లు కవిత, డీవీ లక్ష్మి, జ్యోతి, రమాదేవి, కృష్ణవేణి, ఉమారాణి, పద్మావతి, శ్రీలక్ష్మిలు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసుల మెరుపుదాడులు

- పోలీసుల అదుపులో 11 మంది... ముగ్గురు పరారీ

**బూర్గంపహాడ్, ఏప్రిల్ 24 (ప్రజా జ్యోతి):** పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు శుక్రవారం మెరుపుదాడులు చేశారు. దీనికి సంబంధించి టాస్క్ ఫోర్స్ సీఐ రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని సారపాక పరిధిలోని జామాయిల్ తోటలో పేకాట స్థావరంపై టాస్కోఫ్ర్స్ ఎస్సై జలకం ప్రవీణ్, సుమన్, సిబ్బందితో కలిసి దాడులు చేయగా పేకాట ఆడుతున్న 11 మంది జూదరులు పట్టుబడగా ముగ్గురు వ్యక్తులు పరారైనట్లు తెలిపారు. పేకాట జూదరుల నుంచి రూ.57,915 నగదు, రెండు ద్విచక్రవాహనాలు, 13 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని పేకాట నిర్వాహకులను స్టేషన్కు తరలించినట్లు తెలిపారు.

## ఓటర్లు తమ ఓట్లను బూత్‌స్థాయి అధికారి వద్ద మ్యాపింగ్ చేయించుకోవాలి



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 24, ప్రజా జ్యోతి,** భారత ఎన్నికల సంఘం నిర్వహించిన స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా ఓటర్ మ్యాపింగ్ సంబంధించిన ఓటర్లు త మ వివరాలను సంబంధిత బూత్ స్థా యి అధికారులకు తెలియజేసి ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయించుకోవాలని భద్రాచలం తహసీల్దారు దనియాల వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాచలం మండలంలోని ప్రజలు ఓటర్ మ్యాపింగ్ సంబంధించిన మండలంలో ఓటర్లందరు 2002 సంవత్సరంలో ఏ ప్రాంతంలో నివాసం ఉండి ఓటర్ నమోదు చేసుకున్నారో సంబంధిత ఓటర్లు 2002 సంవత్సరంలో ఉన్న నియోజకవర్గం పేరు, పోలింగ్ కేంద్రం పేరు, క్రమ సంఖ్య, ప్రస్తుతం నివాసం ఉన్న ప్రాంతంలో ఓటర్ మ్యాపింగ్ చేసుకొనుటకు వెంటనే తమ వివరాలను తీసుకొని సంబంధిత బూత్‌స్థాయి అధికారులను సంప్రదించి మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయించుకోవాలని ఆయన కోరారు.

## కొత్తగూడెంకు 22 ధాన్యం కొనుగోలు కేంద్రాలు



**కొత్తగూడెం, ఏప్రిల్ 24 (ప్రజాజ్యోతి)** నియోజకవ ర్గ రైతులకు శుభవార్తగా 22 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మంజూరైనట్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఒక్కో మండలానికి ఒకటి లేదా రెండు కేంద్రాలు మాత్రమే ఉండగా ఈసారి రికార్డు స్థాయిలో కేంద్రాలు ఏర్పా టు చేస్తున్నామని చెప్పారు. సుజాతనగర్, చుంచుపల్లి మండలాలకు తలో 4, లక్ష్మీదేవిపల్లికి 5, పాల్వంచకు 9 కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. రైతు లు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని గ్రామాల సమీపంలోనే కేంద్రాలు ఉండడంతో రవాణా ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. దళారు ల జోక్యం లేకుండా మద్దతు ధర నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతుందని పే ర్కొన్నారు. కేంద్రాలను త్వరితగతిన ప్రారంభించాలని అధికారులకు ఆదేశించారు.

# విదేశీ ఒప్పందాలతో రైతుకు ముప్పు!

- ఐక్య పోరాటాలకు పిలుపు







**కొత్తగూడెం, ఏప్రిల్ 24 (ప్రజాజ్యోతి)** సామ్రాజ్యవాద అనుకూల వాణిజ్య ఒప్పందాలు దేశంలోని రైతులు, ఉత్పత్తిదారులకు తీవ్ర నష్టం కలిగిస్తాయని ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ హెచ్చరించారు. అమెరికాతో కుదుర్చుకుంటున్న ఒప్పందాలను వ్యతిరేకించకపోతే రైతులు ఆత్మహత్యల దిశగా నెట్టబడే ప్రమాదం ఉందన్నారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇటువంటి ఒప్పందాలు చేసుకుంటోందని ఆరోపించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని సామినేని రామారావు నగర్‌లోని కాసాని ఐలయ్య ప్రాంగణంలో జరుగుతున్న తెలంగాణ రైతుసంఘం (ఏఐకేఎస్) మూడో మహాసభలో భాగంగా శుక్రవారం నిర్వహించిన భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందాలు, వ్యవసాయ రంగంపై ప్రభావం సెమినార్‌లో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ అధ్యక్షత వహించారు. విజూ కృష్ణన్ మాట్లాడుతూ... 1936లో ఏఐకేఎస్ ఏర్పాటైనప్పుడు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడినట్లే ప్రస్తుతం కూడా అదే పరిస్థితులు దేశంలో నెలకొన్నాయని పేర్కొన్నారు. సరళీకరణ ఆర్థిక విధానాల కారణంగా అమెరికా, బ్రిటన్‌లతో కుదుర్చుకున్న ఒప్పందాలు రైతుల ప్రయోజనాలను విస్మరిస్తున్నాయని విమర్శించారు. అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన ఒప్పందాన్ని ప్రధాని నరేంద్ర మోదీ విజయంగా పేర్కొనడం ఆశ్చర్యకరమని అన్నారు. భారత ఉత్పత్తులపై అమెరికా అధిక పన్నులు విధిస్తుండగా విదేశీ ఉత్పత్తులను సున్నా సుంకాలతో దిగుమతి చేసుకోవడం ఎలా విజయమవుతుందో వివరించాలన్నారు. అమెరికాలో రైతులకు భారీ సబ్సిడీలు అందుతున్నాయని మన దేశంలో మాత్రం తక్కువ మద్దతు లభిస్తోందని తెలిపారు. యూరోపియన్ యూనియన్ దేశాల్లోనూ వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి కేటాయింపులు తక్కువగా ఉన్నాయని విమర్శించారు. విదేశీ ఒప్పందాల ప్రభావంతో దేశీయ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన అన్నారు. దిగుమతుల పెరుగుదలతో పత్తి, సోయాబీన్, మొక్కజొన్న రైతులు గిట్టుబాటు ధరలు పొందలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాడి రంగంపైనా దిగుమతుల ప్రభావం తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. గతంలో వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు దీర్ఘకాల పోరాటం చేసి వాటిని వెనక్కి తిప్పికొట్టినట్లే ఇప్పటికీ ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాలు, మేధావులు కలిసి చంపారన్ తరహా ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

### పంట మార్పిడి ఉద్యమంలా సాగాలి

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీ వీసీ అల్దాస్ జానయ్య మాట్లాడుతూ ఒకే పంటను సాగు చేయడం, అధిక రసాయనాల వాడకం వల్ల పర్యావరణం, మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. పంట మార్పిడిని ఉద్యమంలా చేపట్టాలని సూచించారు. రైతుల ఆదాయం–ఖర్చుల మధ్య అంతరం పెరగడంతో వారు అప్పుల పాలవుతున్నారని తెలిపారు. సేంద్రియ వ్యవసాయం, బయో ఫెర్టిలైజర్స్ వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. రైతులకు సరైన మార్కెట్, గిట్టుబాటు ధర లభిస్తేనే వ్యవసాయం నిలదొక్కుకుంటుందని చెప్పారు. యూనివర్సిటీ తరపున రైతులకు విత్తనాలు, సాంకేతిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. యువ రైతులను సాయిల్ హెల్త్ టెస్టులపై ప్రోత్సహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్, సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, జంగారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, మహిళా రైతుల రాష్ట్ర కన్వీనర్ కందాల ప్రమీల, రాష్ట్ర నాయకులు మూఢ శోభనా నాయక్, మచ్చా వెంకటేశ్వర్లు, నున్నా నాగేశ్వరరావు, అన్నవరపు కనకయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు చేయాలంటూ అన్నదాతల 'గోస'

- నెలరోజులుగా మార్కెట్ యార్డులో ధాన్యం రాశుల వద్ద రైతుల పడిగాపులు
- ఏవో, పీఏసీఎస్ సిబ్బందిని నిర్బంధించి రైతువేదక వద్ద అన్నదాతల ఆందోళన

**బూర్గంపహాడ్, ఏప్రిల్ 24 (ప్రజా జ్యోతి):** ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి అన్నదాతలు అరిగోస పడుతున్నారు. ప్రభుత్వం సరాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం ఓ సమస్యగా మారితే... అరకొరగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం వద్ద రాశులుగా పోసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం నిర్వాహకులు పొంతన లేని సాకులు చెబుతూ నెల రోజులుగా కొనుగోళ్లు చేయకపోవడంతో ప్రకృతి తమపై ఎప్పుడు కన్నెర్ర చేస్తుందో తెలియక రైతులు ఆయోమయానికి గురవుతున్నారు. తాజాగా శుక్రవారం బూర్గంపహాడ్ వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద తమ ధాన్యం కొనుగోలు చేయాలంటూ అక్కడే ఉన్న రైతువేదిక ఎదుట ఆందోళనకు దిగారు. మండల వ్యవసాయాధికారి శంకర్ తో పాటు పీఏసీఎస్ సీఈవో ప్రసాద్, సొసైటీ సిబ్బంది తిరుపతిరెడ్డిలను రైతువేదికలో ఉంచి రైతులు కొద్దిసేపు నిర్బంధించి బయట తాళాలు వేశారు. రైతులు పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద నెలరోజులుగా రాశులుగా పోసి ఉంచినప్పటికీ ఏదో సాకులు చెప్పి కొనుగోళ్లు చేయడంలేదని... తక్షణమే పంటను కొనుగోలు చేయాలని లేకపోతే అత్మహత్య చేసుకుంటామంటూ అవేదన వెలిబుచ్చారు. పంట కొనుగోలు చేసేందుకు వచ్చిన రైతులకు టోకెన్లు, స్లిప్పులు ఇచ్చి వేచి చూడండని చెబుతున్నారే తప్ప పంటను ఎప్పుడు కొనుగోలు చేస్తారో మాత్రం చెప్పడంలేదని అన్నదాతలు తమ ఆక్రందన వెలిబుచ్చారు. ఇప్పటికే ధాన్యం అమ్ముకోవడానికి నెలరోజులు అలస్యం అయిపోయిందని... నిద్రాహారాలు మాని ధాన్యం రాశుల వద్ద పడిగాపులు పడుతున్నామని అవేదన వ్యక్తం చేశారు. కొందరు రైతులు ప్రభుత్వం పంటను కొనుగోలు చేయకుండా నీతులు చెబుతుందని తాత్సారం చేస్తుందని మధ్య దళారులను ఆశ్రయించి పంటను అమ్ముకుంటే మద్దతు రాక నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని... చేసేది లేక దళారులకి పంటను అమ్ముకోవాల్సి –వస్తుందని ఆవేదన వెలిబుచ్చారు. రైతులు పంట కొనుగోళ్లు ఎందుకు అలస్యం అవుతుందని సొసైటీ సీఈవోను నిలదీస్తే కొనుగోళ్లకు సంబంధించి కొర్రీలు, పొంతనలేకుండా సమాధానాలు చెబుతున్నారని... తమ అధికారులు చెప్పిన విధంగానే పంటను కొనుగోలు చేస్తామంటూ చెబుతున్నారనిరైతులు ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పంట కొనుగోళ్లు ప్రారంభించి అలస్యం లేకుండా విక్రయాలు చేయాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.

### నెలరోజులవుతున్నా ధాన్యం కొనుగోలు చేయరా...? : ఇమ్మడి కొండయ్య, రైతు, బూర్గంపహాడ్

ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కోసం మార్కెట్ యార్డుకు తరలించి నెలరోజులవుతుంది. ధాన్యం కొనుగోలు నిర్వాహకులు ఇప్పటికీ పంటను కొనుగోలు చేయలేదు. ధాన్యం రాశులు వద్ద నిద్రాహారాలు మాని రోజుల తరబడి పడిగాపులు పడాల్సి వస్తుంది. అధికారులు యార్డుకు వచ్చి చూసి పోతున్నారే తప్ప అన్నదాతల పరిస్థితి పట్టించుకోవడంలేదు. ఎండను సైతం లెక్కచేయకుండా పంటను అమ్ముకునేందుకు పనులు మానుకుని మరీ ఎదురుచూడాల్సి వస్తుంది. కొనుగోళ్లు చేయడం చేతకాకపోతే ప్రభుత్వం చేతులెత్తేయాలి... నష్టం అని తెలిసినా దళారులకు అమ్ముకుంటాం కదా... అన్నదాతలను ఇలా ఎందుకు ఇబ్బంది ఎడుతున్నారు. దాళ్వా వద్దు కొనలేం అని ప్రభుత్వం చెబితే ఇతర పంటను వేసుకునేవాళ్లం కదా...రైతులను ఇలా ఎందుకు ఇబ్బందికి గురిచేస్తున్నారు. తక్షణమే పంటను కొనుగోలు చేయాలి.

### కొనుగోళ్లు లేక దళారీలకు అమ్ముకోవాల్సి వస్తుంది... కైపు లక్ష్మిరెడ్డి, రైతు, సంజీవరెడ్డిపాలెం, బూర్గంపహాడ్ మండలం

పంట కోసి మార్కెట్ యార్డుడు అమ్మకానికి తీసుకువచ్చి నెలరోజులైంది. ఇంత వరకు కొనుగోళ్లు జరగడంలేదు. ఇదే అదునుగా భావించిన మధ్య దళారీలు రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రం అలస్యంగా ఏర్పాటు చేసినప్పటికీ కొనుగోళ్లు చేయకపోవడం అన్నదాతలను తీవ్రంగా కష్టానికి, నష్టానికి గురిచేస్తుంది. ప్రభుత్వ మద్దతు ధరతో పంట అమ్ముకుండామంటి ఇంత జాప్యం ఎందుకు జరుగుతుందో తెలియడంలేదు. కొందరు రైతులు బాతావరణ పరిస్థితుల కారణంగా ఎప్పుడు ప్రకృతి కన్నెర్ర చేస్తుందోనని దళారులకు పంటను అమ్మి ఎంతో కొంత వస్తుందని సరిపెట్టుకుంటున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కొనుగోళ్లు ప్రారంభించి అన్నదాతలను కాపాడాలి.



# బిఆర్ఎస్ కార్యకర్తల సమావేశం



**చర్ల, ఏప్రిల్ 24: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో గురువారం రాత్రి ఉప్పరిగూడెం గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం సర్పంచ్ సోయం నాగలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 13 సంవత్సరాలు ఉద్యమాలు చేసిన నాయకుడని కొనియాడారు. రైతుల కోసం రైతు బంధు, రైతు బీమా పథకాలు అమలు చేసి, 24 గంటల విద్యుత్ సరఫరా ద్వారా వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేశారని పేర్కొన్నారు. చెరువుల పునరుద్ధరణ, ప్రాజెక్టుల నిర్మాణం, పోడు భూములను సాగుభూములుగా మార్చడం వంటి కార్యక్రమాలు రాష్ట్ర అభివృద్ధికి దోహదపడ్డాయని తెలిపారు.మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి తాగునీటి సౌకర్యం కల్పించారని, ఆసరా పెన్షన్లు పెంపు, కల్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్ వంటి సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తుచేశారు. బడుగు బలహీన వర్గాల కోసం మెడికల్ కాలేజీలు, గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. రైతు బంధు, ఆసరా పెన్షన్లు, మహిళలకు ఆర్థిక సాయం, గ్యాస్ సబ్సిడీ వంటి అంశాలలో హామీలు నిలబెట్టుకోలేదని విమర్శించారు. రాబోయే ఎంపీటీసీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షులు గోరెంట్ల వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు, సోషల్ మీడియా ఇంచార్జి పంజా రాజు, తడికల బుల్లెబ్బాయి, యువ నాయకులు బొజ్జ సాయి ప్రణయ్ (బాచి), ఎన్నమూరి సృజన్, గాదంశెట్టి కిషోర్, కుక్కడపు సాయి తదితరులు, గ్రామస్తులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇసుక లారీ పట్టివేత

**బూర్గంపహాడ్, ఏప్రిల్ 24 (ప్రజా జ్యోతి):** ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని బూర్గంపహాడ్ పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మోతే పట్టీనగర్ గ్రామంలోని గోదావరి నుంచి అక్రమంగా లారీలో ఇసుక తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు ఎస్సై దేవ్ సింగ్ తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. ఇసుక లారీని స్టేషన్ కు తరలించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## మహా కుంభాభిషేకానికి ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం

- ఇంటింటికి కరపత్రాల పంపిణీ, దేవాలయాల్లో ప్రత్యేక ఆహ్వానం
- మే 1 నుంచి 6 వరకు అన్నపురెడ్డిపల్లిలో వైభవంగా ఉత్సవాలు





**అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 24, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి గ్రామంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో మే 1వ తేదీ నుంచి 6వ తేదీ వరకు నిర్వహించనున్న మహా కుంభాభిషేక మహోత్సవాలకు ప్రచార కార్యక్రమాలు జో రుగా సాగుతున్నాయి. ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రచార క మిటీ సభ్యులు గ్రామంలోని దేవాలయాలకు, ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రజలను ఆహ్వానించారు.మేళతాళాల నడుమ భక్తి శ్రద్ధలతో ప్రచార యాత్ర నిర్వహించగా గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మహా కుంభాభిషేకం ఆలయ పవిత్రత, ఆధ్యాత్మిక శక్తి పునరుద్ధరణకు ప్రతీకగా భావిస్తారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా భక్తులకు శాంతి, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలుగుతాయని పండితులు చెబుతున్నారు.అన్నపురెడ్డిపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయం పరిసర ప్రాంతాల్లో విశేష ఖ్యాతి గాంచిన క్షేత్రంగా పేరు పొందింది. భక్తుల కోరికలు తీర్చే కలియుగ దైవంగా స్వామివారిని గ్రామస్తులు విశ్వసిస్తారు. ప్రతి సంవత్సరం ఆలయంలో జరిగే ఉత్సవాలకు పరిసర గ్రామాల నుంచి భారీగా భక్తులు తరలివస్తుంటారు.ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పర్యవేక్షణలో కమిటీ సభ్యులు ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేస్తున్నారు. ఆలయ ఈవో పాకాల వెంకటరమణ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది అన్ని సదుపాయాలను సమకూరుస్తున్నారు.ఈ కార్యక్రమంలో ప్రచార కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ఆలయ భక్తులు పాల్గొన్నారు.మహా కుంభాభిషేక మహోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

## నూతన ప్రైవేట్ పాఠశాలలకు అనుమతి ఇవ్వవద్దు



**ఇల్లందు, ఏప్రిల్ 24, ప్రజా జ్యోతి:** ఇల్లందులో నూతన ప్రైవేట్ పాఠశాలకు అనుమతి ఇవ్వవద్దని శుక్రవారం ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉమ్మగాని హరీష్, పట్టణ అధ్యక్షులు యాకేష్ లు యంఈఓ ఉమా శంకర్ కు వినతి పత్రాన్ని అందజేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇల్లందు పట్టణ కేంద్రంలో నెంబర్ 2 బస్తిలో గల పాత శాంతినికేతన్ స్కూల్లో నూతన ప్రైవేట్ స్కూల్ కి అనుమతి ఇవ్వకూడదని, ఇక్కడ దగ్గరలో ఉన్న యుపిఎస్ స్కూల్స్ మామిడి చెట్ల బడి, బర్లపెంట బడి రెండు ఉన్నప్పటికీ అక్కడ యుపిఎస్ పాఠశాల ఇన్చార్జి కూడా నో అబ్జెక్షన్ లెటర్ ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలలో నడిపే ఉద్దేశం ప్రభుత్వానికి లేదా అని చెప్పేసి మేము అడుగుతా ఉన్నామని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో నెంబర్ 2 బస్తీలో నూతన ప్రైవేట్ స్కూల్ కూ అనుమతిస్తే ఊరుకునే సమస్య లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యారంగం బలపడాలని, విద్యార్థుల సంఖ్య పెరగాలని మేము పలు కార్యక్రమాల ద్వారా ప్రజలను అఖిలభారత యువజన సమైక్య ఏఐవైఎఫ్ మోటివేషన్ చేస్తున్న క్రమంలో ప్రభుత్వ సంస్థలో పనిచేస్తూ ప్రభుత్వ టీచర్లుగా ఉంటూ నో అబ్జెక్షన్ లెటర్స్ ఇవ్వడం మాత్రం సమంజసం కాదన్నారు. ఈ ప్రైవేట్ స్కూల్ అనుమతి ద్వారా ఇక్కడ ఉన్న రెండు యుపిఎస్ స్కూల్ కూడా మూతపడే అవకాశం ఉందని, తల్లిదండ్రులకు కల్లబొల్లి మాటలు చెబుతూ అడ్మిషన్స్ కోసం పర్మిషన్ లేకుండానే నూతన పాఠశాలను ప్రచారం చేయడం వింతగా ఉందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. నూతన ప్రైవేట్ స్కూల్ కు అనుమతి ఇస్తే అవసరమైతే బస్తీ వాసులు, ఇతర ప్రజా సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

## ఈ-రోల్ మ్యాపింగ్‌కు సహకరించండి : చుంచుపల్లి తహసీల్దార్ విజ్ఞప్తి



**చుంచుపల్లి, ఏప్రిల్ 24 ( ప్రజాజ్యోతి )** మండలంలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్) కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో అమలు చేస్తున్నట్లు తహసీల్దార్ కూచిపూడి నాగరాజు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి బూత్ లెవల్ ఆఫీసర్ (బిఎల్ఓ) తమ పరిధిలోని ఓటర్ల వివరాలను సమగ్రంగా పరిశీలించి ఈ –రోల్ మ్యాపింగ్‌ను తప్పనిసరిగా పూర్తి చేయాలని సూచించారు. 2002 ఓటరు జాబితాను ప్రామాణికంగా తీసుకుని ప్రతి ఓటరు వివరాలు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల వివరాలను కూడా ఫ్యామిలీ మ్యాపింగ్ కింద నమోదు చేస్తున్నామని చెప్పారు. మండలంలోని ప్రజలు తమకు సంబంధించిన బిఎల్ఓలను సంప్రదించి ఓటరు వివరాలు, కుటుంబ సభ్యుల వివరాలను సక్రమంగా నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ ప్రక్రియలో ప్రతి ఓటరు చురుకుగా పాల్గొనడం ద్వారా ఖచ్చితమైన ఓటరు జాబితా సిద్ధం అవుతుందని పేర్కొన్నారు. చుంచుపల్లి మండల పరిధిలోని 18 పంచాయతీల్లో ఉన్న 41 పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, వార్డ్ సభ్యులు ఈ కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## భద్రాద్రి క్షేత్ర దర్శిని డాక్యుమెంటరీ విడుదల



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 24, ప్రజా జ్యోతి,** భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామివారి దివ్యక్షేత్ర మహిమాన్విత చరిత్ర ఆధారంగా రూపొందించిన భద్రాద్రి క్షేత్ర దర్శిని డాక్యుమెంటరీని శుక్రవారం భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు విడుదల చేశారు. ఈ డాక్యుమెంటరీలో భద్రాచలం ఆలయ చరిత్ర, శ్రీ సీతారాముల వైభవం, గోదావరి తీరపు పవిత్రత, అలాగే ఈ క్షేత్రానికి సంబంధించిన విశేషాలను అద్భుతమైన దృశ్య రూపంలో అందించారు. భక్తి, సంస్కృతి, చరిత్ర అన్ని కలిసిన ఒక ఆధ్యాత్మిక అనుభూతిని ప్రేక్షకులకు అందించేలా ఈ చిత్రాన్ని రూపొందించారు. ఈ డాక్యుమెంటరీ ఆహా ఓటీటీ ప్లాట్ ఫాంలో ప్రసారమవుతుందని తెలిపారు. కె.సాయిభారతి నిర్మాతగా వ్యవహరించగా అభిలాష్ దర్శకత్వ బాధ్యతలు పూర్తి చేశారు.

## కార్మిక ప్రాంతాల్లో ఘనంగా మేడే ఉత్సవాలు

- వారోత్సవాలకు సిఐటియు పిలుపు



**కొత్తగూడెం, ఏప్రిల్ 24 ( ప్రజాజ్యోతి )** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా కార్మిక ప్రాంతాల్లో 140వ మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సిఐటియు రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు పిలుపునిచ్చారు. మే 1 నుంచి 7వ తేదీ వరకు కార్మిక వారోత్సవాలు నిర్వహించాలని సూచించారు. కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించిన సిఐటియు జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడే సందర్భంగా పని ప్రాంతాలు, కార్మిక నివాస ప్రాంతాల్లో ఎర్రజెండాలు ఎగురవేయాలని వాడవాడలా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. చికాగో అమరవీరుల స్ఫూర్తితో సాధించుకున్న ఎనిమిది గంటల పని దిన చరిత్రను ప్రతి కార్మికుడు తెలుసుకోవాలని అన్నారు. కార్మిక హక్కుల కోసం గతంలో జరిగిన పోరాటాలను అధ్యయనం చేసి ప్రజల్లో చైతన్యం కల్పించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రచారం చేయాలని నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసే వరకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మేడే వారోత్సవాల్లో భాగంగా కార్మికులు, కర్షకులు, మహిళలు, యువత పాల్గొనేలా ఆటపాటలు, చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అమరవీరుల స్ఫూర్తిని కొనసాగిస్తూ కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్, ఉపాధ్యక్షురాలు జీలకర్ర పద్మ, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ ఏ నబీ, గద్దల శ్రీనివాస్, సహాయ కార్యదర్శి కే సత్య, భూక్య రమేష్, జిల్లా కమిటీ సభ్యులు తాళ్లూరి కృష్ణ, సాంబశివరావు, శకుంతల, అంబాల దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మూల ఆదివాసి సంక్షేమ సంఘం కార్యక్రమం

- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

**చర్ల, ఏప్రిల్ 24: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలం రాళ్లపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన మూల ఆదివాసి సంక్షేమ సంఘం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఆదివాసి సాంప్రదాయాల నడుమ జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా ఓ పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆదివాసి సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ నల్లపు దుర్గాప్రసాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు చీమలమర్రి మురళి, చర్ల సీఐ రాజు వర్మ, ఎస్సైలు నర్సిరెడ్డి ,కేశవ్ లు ,స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ఆదివాసి నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.



## మహిళ కడుపులో నుంచి 4 కిలోల ఫైబ్రాయిడ్ తొలగింపు

- విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించిన ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ కొమ్మూరు శ్రావణి



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 24 ప్రజాజ్యోతి,** భద్రాచలం పట్టణంలోని ప్రముఖ వైద్య శాల నీల నర్సింగ్ హోమ్ డాక్టర్ సుబ్బరాజు హాస్పిటల్ లో వైద్యులు అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే ములుగు జిల్లా వెంకటాపురం మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన 45 సంవత్సరాల వయస్సు గల ధనలక్ష్మి అనే మహిళ గత కొంతకాలంగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతోంది. నొప్పి మరీ ఎక్కువ కావడంతో కుటుంబ సభ్యులు ఆమెను పాత ఎల్ఐసీ రోడ్డులో ఉన్న నీల నర్సింగ్ హోమ్‌కు తీసుకువచ్చారు. హాస్పిటల్‌లోని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ కొమ్మూరు శ్రావణి వెంటనే స్పందించి బాధితురాలికి వివిధ రకాల పరీక్షలు, స్కానింగ్ నిర్వహించారు. ఈ పరీక్షల్లో ఆమె గర్భాశయంలో అతిపెద్ద ఫైబ్రాయిడ్ (గడ్డ) ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. మహిళ తీవ్రమైన వేదనకు గురవుతుండటంతో ఆలస్యం చేయకుండా ఎమర్జెన్సీగా శస్త్రచికిత్స చేయాలని డాక్టర్లు నిర్ణయించారు. అత్యంత క్లిష్టమైన ఈ ఆపరేషన్‌ను డాక్టర్ శ్రావణి నేతృత్వంలోని బృందం విజయవంతంగా పూర్తి చేసింది. బాధితురాలి కడుపులో నుంచి సుమారు 4 కేజీల బరువు కలిగిన భారీ ఫైబ్రాయిడ్‌ను తొలగించారు. ప్రస్తుతం మహిళ ఆరోగ్యం నిలకడగా ఉందని, ప్రాణాపాయం నుంచి బయటపడిందని వైద్యులు తెలిపారు. సకాలంలో స్పందించి మెరుగైన వైద్యం అందించిన డాక్టర్ కొమ్మూరు శ్రావణికి, ఆసుపత్రి సిబ్బందికి బాధితురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## శ్రీ సరస్వతి విద్యా నికేతన్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే







**చర్ల, ఏప్రిల్ 24 :(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని తేగడ లోగల శ్రీ సరస్వతి విద్యా నికేతన్ లో విద్యార్థులకు పరీక్షలు పూర్తైన సందర్భంగా శ్రీ సరస్వతి విద్యా నికేతన్‌లో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల విజయాలను అభినందిస్తూ వారి ఫలితాలను వెల్లడించారు. ఈ కార్యక్రమం ప్రారంభంలో సంస్థ వ్యవస్థాపకుడు శ్రీనివాస్ చక్రవర్తిని స్మరించుకున్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీమతి నీలు చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన జరిగింది. అనంతరం విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ లిఖిత మాట్లాడుతూ, ఈ సంవత్సరం విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చారని తెలిపారు. విద్యార్థులకు, వారి అభివృద్ధికి సహకరించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులు అరుణ, రాజేశ్వరి, పూజ, చంద్రకళ, శ్రావణి, రమేష్‌లకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ముఖ్య అతిథి నీలు మాట్లాడుతూ, విద్యార్థుల ప్రతిభ అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ విద్యార్థిగా ఎంపికైన తేగడ వెంకట్ కుమారుడు టోనీకి ట్రోఫీ అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రదర్శించిన పాటలు, స్కిట్స్ విద్యార్థుల అభివృద్ధికి ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణ మాట్లాడుతూ, శ్రీ సరస్వతి విద్యా నికేతన్ కేవలం విద్యకే కాకుండా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్న పాఠశాల అని చెప్పారు. స్కూల్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లను గుర్తుచేశారు. టోనీ, సహర్ష జయనేష్ రూపొందించిన చిత్రాలను వేదికపై ప్రదర్శించి అభినందించారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యానం నిర్వహించిన ఉపాధ్యాయురాలు పూజ ప్రోగ్రామ్‌ను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ,విద్యార్థులు, తల్లిదండ్రులు ,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





## ర్యాంకుల వేటలో బలవుతున్న బాల్యం...

# కార్పొరేట్ బ'కాసు'రుల కక్కుర్తి

- ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..!
- ప్రభుత్వ ఉపాధ్యాయుల పిల్లలు కూడా ప్రైవేటు వైపే.
- ర్యాంకుల వేటలో బాల్యం బలి.
- ఫలితాలు రాకముందే అడ్మిషన్లు.
- అధిక ఫీజుల పై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం.



**నేటి విద్యా వ్యవస్థలో విద్యార్థుల భవిష్యత్తు కంటే ర్యాంకులే పరమావధిగా మారుతున్నాయి. ముఖ్యంగా కార్పొరేట్ కళాశాలల తీరుపై సర్వత్రా ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. విద్యను వ్యాపారంగా మార్చి, విద్యార్థులను కేవలం 'ర్యాంకులు ఇచ్చే యంత్రాలు'గా చూస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు విద్యార్థులతో కళకళలాడుతూ ఉండేవి. కానీ నేటి తీరు పూర్తి బిన్నంగా కనపడుతోందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ, ప్రభుత్వం ఇచ్చే జీతం తీసుకుంటూ వారి పిల్లలని మాత్రం ప్రైవేటు కళాశాలల్లో చదివిస్తున్నారంటే అతిశయోక్తి కాదు.**

- పాల్వంచ, ప్రజాజ్యోతి

ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా వారి పిల్లలని ప్రైవేటు పాఠశాలల్లో చదివిస్తున్నారంటే ప్రభుత్వ పాఠశాలల దుస్థితి ఎలా ఉందో అంచనా వేయండి అంటూ ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

### ››› ఫలితాల కంటే ముందే వేట

పదో తరగతి పరీక్షా ఫలితాలు కూడా విడుదల కాక ముందే కార్పొరేట్ కాలేజీలు అడ్మిషన్ల వేట మొదలు పెట్టి, ఆకర్షణీయమైన ప్రకటనలు, నకిలీ ర్యాంకుల ప్రచారంతో తల్లిదండ్రులను బుట్టలో వేసుకుంటున్నారని పలువురు చర్చించుకుంటున్నారు. పదో తరగతి పరీక్షలు ముగియడమే ఆలస్యం, కార్పొరేట్ కాలేజీల మార్కెటింగ్ ప్రతినిధులు ఇంటి తలుపు తడుతున్నారని, ఫలితాలు వెలువడకముందే, విద్యార్థుల ప్రతిభను అంచనా వేయకుండానే "ప్రీ-అడ్మిషన్లు" అంటూ వేల రూపాయలు వసూలు చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అడ్మిషన్ల షెడ్యూల్ విడుదల కావాల్సి ఉన్నా, ప్రైవేట్ సంస్థలు మాత్రం అప్పుడే తరగతులను కూడా ప్రారంభించేయడం విద్యాశాఖ పర్యవేక్షణ లోపానికి నిదర్శనమని ప్రజలు అనుకుంటున్నారు.

### ››› ఫీజుల మాయాజాలం, లక్షల్లో వసూళ్లు

సాధారణ ఇంటర్మీడియట్ విద్యకు కూడా అక్షరాలా లక్షల్లో ఫీజులు నిర్ణయిస్తున్నారు. ఐఐటీ, నీట్, జేఈఈ కోచింగ్ అంటూ ప్రత్యేక ప్యాకేజీల పేరుతో రూ. 2 లక్షల నుండి రూ. 5 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. అంతేకాక ఏసీ క్లాస్‌రూమ్‌లు, హాస్టల్ సౌకర్యాలు, ప్రత్యేక స్టడీ మెటీరియల్ పేరిట మధ్యతరగతి తల్లిదండ్రుల జేబులకు చిల్లు పెడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ››› రెగ్యులర్ సిలబస్‌ను గాలికొదిలేసి

ఎంసెట్, మెయిన్స్ శిక్షణ పేరుతో రెగ్యులర్ సిలబస్‌ను గాలికొదిలేసి, కేవలం ఆబ్జెక్టివ్ తరహా బోధనకే పరిమితం చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. పోటీ పరీక్షల పేరుతో కేవలం ఆబ్జెక్టివ్ విధానంలో బోధనకు పరిమితం అవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. దీని వల్ల విద్యార్థుల్లో భావనాత్మక అవగాహన తగ్గిపోతోందని విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు.

### ››› ఎదురు డబ్బులిచ్చి మరి అడ్మిషన్లు

కొన్ని కళాశాలలు అయితే ఎదురు డబ్బులిచ్చి మరి అడ్మిషన్లు చేసుకుంటున్నారని ప్రజలు మాట్లాడుకుంటున్నారు. ప్రైవేటు కళాశాలలో ఎవరినైన జాయిన్ చేసిన కూడా జాయిన్ చేసిన వ్యక్తి కి ఇరవై వేలకి తగ్గకుండా పారితోషికం చెల్లిస్తున్నారన్న విషయం చర్చనీయాంశం గా మారింది. ఆ తరవాత ఆ డబ్బులని ఆ ఫీజు , ఈ ఫీజు పేరుతో వడ్డీ తో సహా వసూలు చేస్తున్నారని సమాచారం. ఇది ఇలా ఉండగా స్థానిక ప్రైవేటు కళాశాలలు కూడా కార్పొరేటు కి ఏ మాత్రం తగ్గకుండా ఫీజులలో పోటీ పడుతూ లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ, సామాన్యుడికి విద్యను దూరం చేస్తున్నాయని పలువురు విమర్శిస్తున్నారు.

### ››› ఒత్తిడి తట్టుకోలేక బలవన్మరణాలు

కార్పొరేట్ కాలేజీల్లో క్రమశిక్షణ పేరిట విద్యార్థులపై భరించలేనంత ఒత్తిడిని పెంచుతూ, ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు విశ్రాంతి లేని చదువులు, వీక్లీ టెస్టుల మార్కుల ఆధారంగా సెక్షన్లు మార్చడం వల్ల విద్యార్థులు తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారని, ఈ ఒత్తిడిని భరించలేక, తల్లిదండ్రుల అంచనాలను అందుకోలేక ఎంతో మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు నిత్యం వెలుగులోకి వస్తున్నాయని విద్యార్థి సంఘ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ››› బ్రాండ్ ఇమేజ్, ర్యాంకులే ముఖ్యం

విద్యార్థుల ప్రాణాల కంటే తమ బ్రాండ్ ఇమేజ్, ర్యాంకులే ముఖ్యమన్నట్లుగా ప్రవర్తిస్తున్న యాజమాన్యాల ధోరణి పై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇంత జరుగుతున్నా విద్యా వ్యవస్థ ఏమి ఎరుగనట్టు ఎందుకు చూస్తున్నదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు..

### ››› మానసిక వేధింపులు

తక్కువ మార్కులు వస్తే అటు తల్లిదండ్రులు, ఇటు ఉపాధ్యాయులు ఒత్తిడి చేయడం, తరగతి గదిలో అందరి ముందు అవమానించడం, నిరంతర పరీక్షలు, వంటి వాటితో మానసికంగా విద్యార్థులు కుంగిపోతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ››› ప్రభుత్వ కళాశాలల దుస్థితి

కార్పొరేట్ సంస్థల ధాటికి ప్రభుత్వ కళాశాలలు ఉనికిని కోల్పోతున్నాయి. అరకొర వసతులు, సిబ్బంది కొరతతో ప్రభుత్వ విద్యా సంస్థలు అడ్మిషన్లకు నోచుకోలేకపోతున్నాయి. ఒకప్పుడు మేధావులను తయారుచేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలు నేడు విద్యార్థులు లేక వెలవెలబోతుండటం విద్యాశాఖ వైఫల్యానికి నిదర్శనమని విద్యావేత్తలు మండిపడుతున్నారు. విద్య అనేది విజ్ఞానాన్ని పంచాలి కానీ, ప్రాణాలను తీయకూడదు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని ఫీజుల నియంత్రణతో పాటు, విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేలా కఠిన నిబంధనలు అమలు చేయాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.



# ఎర్రగుంట వద్ద రైతుల ధర్నా ఘటనపై స్పందించిన అదనపు కలెక్టర్ వేణుగోపాల్

- **ధాన్యం శుభ్రపరిచి తీసుకురావాలని రైతులకు విజ్ఞప్తి**



**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 24 ,(ప్రజా జ్యోతి)** జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైనదని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నపురెడ్డిపల్లి మండలంలోని ఆరు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సుమారు 15 లారీల ధాన్యం రావడం జరిగిందన్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఎర్రగుంట వద్ద జాతీయ రహదారిపై రైతులు ధర్నా నిర్వహించిన ఘటనపై ఆయన స్పందించారు. పౌరసరఫరాల శాఖ అధికారుల పరిశీలనలో ధాన్యంలో తేమ శాతం (మాయిశ్చర్) అనుకూలంగా ఉన్నప్పటికీ, ధాన్యం పరిశుభ్రత లోపించడం గమనించినట్లు తెలిపారు. గుంపెనలు , మలినాలు కలిసి వుండటం వల్ల నాణ్యత ప్రమాణాలకు సరిపోకపోవడంతో కొనుగోలులో ఇబ్బందులు తలెత్తినట్లు వివరించారు. వ్యవసాయ శాఖ అధికారులను ప్రశ్నించగా కూడా ధాన్యం శుభ్రపరిచే ప్రక్రియ సరిగా జరగలేదని వెల్లడించినట్లు చెప్పారు. వెంటనే ప్యాడీ క్లీనర్లను వినియోగించి ధాన్యాన్ని శుభ్రపరిచిన తరువాత కొంతవరకు మెరుగైన ఫలితాలు వచ్చినట్లు తెలిపారు. అయినప్పటికీ, కొంతమంది రైతులు శుభ్రపరచకుండా ధాన్యం కొనుగోలు చేయాలని ఒత్తిడి చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారి ధర్నాకు దారితీసిందన్నారు. ఈ విషయంపై తక్షణమే పౌరసరఫరాల శాఖ అధికారులు, సంబంధిత మేనేజర్లు రైతులతో చర్చించి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. రేపటి నుండి జిల్లా వ్యాప్తంగా అన్ని కొనుగోలు కేంద్రాలలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యాన్ని పరిశుభ్రపరిచి మాత్రమే కొనుగోలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి వ్యవసాయ శాఖ అధికారులు, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌లకు ఇప్పటికే మార్గదర్శకాలు అందించినట్లు వెల్లడించారు. రైతులు ప్రభుత్వ నియమ నిబంధనలను పాటిస్తూ తమ ధాన్యాన్ని పూర్తిగా శుభ్రపరిచి తీసుకు రావాలని, కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు రైతులు సహకరించాలని కోరారు

# కాలేశ్వరంవిషయం లో కేసిఆర్,హరీష్ రావు కి హైకోర్టులో భారీ ఊరట



**టేకులపల్లి,ఏప్రిల్ 24,**కమిషన్ పేరుతో కాలేశ్వరం ప్రాజెక్టు లక్ష్యాన్ని దెబ్బ తీయాలనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్రల ను తిప్పికొట్టిన రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం కాలేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను నిలిపివేస్తూ తెలం గాణ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిది అని బిఆర్ఎస్ మండల అధ్యక్షులు వరప్రసాద్ గౌడ్,ప్రధాన కార్యదర్శి బోడ బాలు నాయక్ అన్నారు.శుక్రవారం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం లో జరిగిన పత్రిక సమావేశం లో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులువరప్రసాద్,ప్రధాన కార్యదర్శి బోడాబాలునాయక్ మాట్లాడుతూ కాలేశ్వరం ప్రాజెక్టు విషయంలో బిఆర్ ఎస్ అధినేత,రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావుకు హైకోర్టులో భారీ ఊరట లభించడం హర్షనీయమని అన్నారు.ఇది కేవలం బీఆర్ఎస్ విజయం మాత్రమే కాదు,నాలుగు కోట్ల తెలంగా ణ ప్రజల ఆకాంక్షల విజయానికి సంకేతంగా అభివర్ణించారు.జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై స్పందించిన హైకోర్టు ఈ నివేదిక ఆధారంగా ఎలాంటి తదుపరి చర్యలు తీసుకోవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని పిసి కమిషన్ తన విచారణలో ఎలాంటి కనీస నిబంధనలు పాటించలేదని అన్నారు. 2025 జూలైలో ప్రభుత్వం సమర్పించిన ఈ రిపోర్టు కేవలం రాజకీయ ప్రయోజనా ల కోసమేనని తెలంగాణ ప్రజల కోసం తెలంగాణ రాష్ట్వర ప్రదాయని ప్రాజెక్టు అని ఇప్పటికీ రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అదే కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారానే వ్యవసాయా నికి సాగునీరు అందిస్తుందని ఆ విషయాన్ని మరిచిన కాంగ్రె స్ ప్రభుత్వం కాలేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అసత్య ప్రచారాలను యావత్ తెలంగాణ ప్రజానీకం గమనిస్తున్నారని రాజకీయ కక్షతో ప్రాజెక్టు ప్రతిష్టను దెబ్బతీయాలని చూస్తే రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రజలే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి హైకోర్టు ఏ విధమైన స్పష్టమైన తీర్పు జయిస్తుందని కాలేశ్వరం ప్రాజెక్టు ద్వారా తెలంగాణ రాష్ట్రం సాధించిన ప్రగతిని తొలి ముఖ్యమంత్రివర్యులు కేసీఆర్ కీర్తిని ఎవరు చెరిపి వేయలేరని అన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బోడ బాలు నాయక్, జిల్లా నాయకులు భూక్యా దళ్సింగ్ నాయక్, మాజీ ఎంపీటీసీలు జాలాది అప్పారావు,భూక్యా బాలకృష్ణ,మండల నాయకు లు నామాల బిక్షం,ఆంగోత్ లక్పతి,సర్పంచులు బానోత్ రామా నాయక్,నాకా నాయక్, కోఆప్షన్ సభ్యుడు మౌలానా, మహిళా మండల అధ్యక్షురా లు ఆమెడ రేణుక,కొండ బత్తుల శ్యాంప్రసాద్,నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమస్య పరిష్కారం చేయాలి

- **ఆర్టీసీ డ్రైవర్ శంకర్ ఆత్మహత్యకు ప్రభుత్వం బాధ్యత వహించాలి.**
- **ప్రగతిశీల యువజన సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు చింత నరసింహారావు డిమాండ్**




**టేకులపల్లి,ఏప్రిల్ 24, ప్రజాజ్యోతి:**ఆర్టీసీ కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి,కార్మికులు చేసిన సంఘటన విరమణ చేసే విధంగా ప్రభుత్వం ముందుకు రావాలని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు చింత నరసింహరావు పేర్కొన్నారు. శుక్రవారం టేకులపల్లిలోని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో పివైఎల్ మండల కార్యదర్శి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పలువురు పివైఎల్ ముఖ్య నాయకులు పాల్గొని ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలనీ వారు డిమాం డ్ చేశారు.2021నుండి వేతన సవరణ చేయాలనీ, ఆర్టీసీ ని ప్రభుత్వంలో విలీనం చేయాలనీ కోరుతూ గత మూడు రోజుల నుంచి ఆర్టీసీ కార్మికులు వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ప్రజాస్వామ్యంగా, శాంతియుత పద్ధతిలో నిరసన తెలియజేస్తున్నారని ఈ నిరసనకు ప్రజలు, ప్రయాణికులు సహకరించాలని కోరారు. ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు.ఆర్టీసీ ఆస్తులను కాపాడాలని తదితర డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించే విధంగా ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరపాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రైవేటు డ్రైవర్లు బస్సులను నడపడానికి రావద్దని ఆర్టీసీ కార్మికుల కడుపు కొట్టొద్దని వారు కోరారు. అలాగే గురువారం వరంగల్ జిల్లా నర్సంపేట డిపో లో మరణించిన శంకర్ గౌడ్ కుటుంబానికి కోటి రూపాయలు ఎక్స్ గ్రేషియా ప్రకటించి,ఆయన కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆర్టీసీ కార్మికులు తొందరపడి ఎవరు ఆత్మ హత్యలకు పాల్పడొద్దని అని వారు కోరారు.పోరాటల వల్ల సమస్యలు పరిష్కారం అవుతాయని వారు తెలిపారు. ఆర్టీసీ కార్మికులు సమస్య రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చేసేంతవరకు సమ్మె విరమించొద్దని వారు అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు ప్రగతిశీల యువజన సంఘం (పివైయల్) కొత్తగూడెం జిల్లా కమిటీ సంపూర్ణ మద్దత్తు ను తెలుపుతున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో పివైయల్ జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్ నోముల భానుచంధర్,జిల్లా కార్యదర్శి పర్సిక రవి,జిల్లా నాయకులు అటికం శేఖర్, జోగా కృష్ణ,సాధనపల్లి రవి, ముసలి సతీష్, కోడెం రవి,తదితరులు పాల్గొన్నారు.

# విపక్షాల ఐక్యతతో వేడెక్కిన ఆర్టీసీ సమ్మె

- **కొత్తగూడెంలో ఆర్టీసీ సమ్మె ఉధృతం**
- **శంకర్ గౌడ్ కు నివాళులతో కార్మికుల ఆందోళన**

**కొత్తగూడెం, ఏప్రిల్ 24 (ప్రజాజ్యోతి )** కొత్తగూడెంలో ఆర్టీసీ కార్మికుల సమ్మె ఉధృతంగా కొనసాగింది. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన ఈ సమ్మెపై మూడోవ రోజుకు చేరుకున్నప్పటికి ప్రభుత్వం స్పందించకపోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కార్మిక సంఘాల పిలుపుతో బస్టాండ్ వద్ద నిర్వహించిన ధర్నాకు జేఏసీ నేతలు, విపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు పెద్దఎత్తున హాజరై మద్దతు తెలిపారు. బస్టాండ్ ప్రాంగణం నినాదాలతో మార్మోగింది. డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని, ప్రభుత్వం చర్చలకు రావాలి అంటూ ఆందోళనకారులు గళమెత్తారు. సమ్మె ప్రభావంతో ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమవడంతో ప్రజా రవాణా సేవలు దెబ్బతిన్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. ప్రజా సంఘాల మద్దతుతో కొత్తగూడెం బస్టాండ్ సెంటర్ లో ఆర్టీసీ కార్మికుల సమ్మె మరింత వేడెక్కింది. ఈ సందర్భంగా ప్రాణాత్యాగం చేసిన ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ కు నివాళులు అర్పించారు.

**ఆత్మహత్యలొద్దు... తెగించి పోరాడుదాం : ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రభుత్వ వైఖరిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆర్టీసీ కార్మికులతో తగవు పెట్టుకుంటే పాలకులకు పతనం తప్పదని హెచ్చరించారు. యూనియన్లంటే పాలకులకు ఎందుకు భయం అని ప్రశ్నించారు. ప్రజారవాణాను ప్రైవేటీకరించేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. చట్టబద్ధంగా చేపట్టిన సమ్మెపై నిర్బంధాలు విధించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మొండివైఖరితో ప్రభుత్వం ఎమర్జెన్సీ పరిస్థితులను తలపించేలా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో కార్మికులను ఉద్దేశించి ఆత్మహత్యలొద్దు... తెగించి పోరాడాలి అంటూ పిలుపునిచ్చారు. డిమాండ్లు నెరవేరే వరకు ఆర్టీసీ కార్మికులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. శంకర్ గౌడ్ మృతికి ప్రభుత్వం బాధ్యత వహించాలని కూడా డిమాండ్ చేశారు.

**ఆర్టీసీ కార్మికుల డిమాండ్లు వెంటనే పరిష్కరించాలి : మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరావు**

ఈ సందర్భంగా మాట్లాడిన మాజీ మంత్రి, బీఆర్ ఎస్ నాయకులు వనమా వెంకటేశ్వరావు ఆర్టీసీ కార్మికుల సమ్మెకు పూర్తి మద్దతు ప్రకటించారు. కార్మికులు న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడుతున్నారని ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్మికుల పట్ల కఠిన వైఖరి అవలంబించడం సరైంది కాదని, చర్చల ద్వారా పరిష్కారం కనుగొనాలని సూచించారు. ప్రజలకు అవసరమైన ఆర్టీసీ సేవలు నిలిచిపోకుండా ఉండాలంటే కార్మికుల సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాల్సిందేనని హెచ్చరించారు. ప్రభుత్వం ఆలస్యం చేస్తే ప్రజల్లో ఆగ్రహం మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**డిమాండ్లు తీర్చే వరకు పోరాటం ఆగదు... సీపీఎం స్పష్టం : పోతినేని సుదర్శన్ రావు**

ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ బస్టాండ్ వద్ద నిర్వహించిన భారీ ధర్నాలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు పాల్గొని మాట్లాడారు. కార్మికులు న్యాయమైన డిమాండ్ల కోసం పోరాటం చేస్తున్నారని, ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్మికులపై ఒత్తిడి తీసుకురావడం, నిర్బంధాలు విధించడం సరైన పద్ధతి కాదని చర్చల ద్వారా సమస్యను పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు అవసరమైన ఆర్టీసీ సేవలు నిలిచిపోకుండా ఉండాలంటే కార్మికుల సమస్యలను త్వరగా పరిష్కరించాల్సిందేనని పేర్కొన్నారు. కార్మికుల పోరాటానికి సీపీఎం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

**శంకర్ గౌడ్ కుటుంబానికి న్యాయం చేయాలి : యెర్రా కామేష్**

ఆర్టీసీ కార్మికుల సమ్మెలో పాల్గొన్న జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ కార్మికులకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. సమ్మెకు దారితీసిన పరిస్థితులపై ప్రభుత్వం బాధ్యత వహించాల్సిందేనని అన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ ఎస్ .డి. నజీర్, కన్వీనర్ బి.ఎన్. రావు, కో–కన్వీనర్ ఎన్. అనిల్, పి.వి. ప్రసాద్, జేఏసీ నాయకులు సామ్యూల్, ఆర్.ఎన్. సింగ్, నూర్ జహాన్, పర్వీన్, సరస్వతి, రేణుక, సంధ్య, ఎస్ కే జి.ఎస్. పాషా, ఖాజా మొహినుద్దీన్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే. సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, సలిగంటి శ్రీనివాస్, కరిష రత్నకుమారి, మేదిని లక్ష్మి, షాహిన్, కైసర్, షమీమ్, వీణ, లత, శారద, మల్లిక, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజె రమేష్, బి.ఆర్.ఎస్ నాయకులు కాపు సీతాలక్ష్మి, కొట్టి వెంకటేశ్వర్లు, సిపిఐ {ఎంఎల్} న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం ఖమ్మం సంయుక్త జిల్లా కమిటీ కార్యదర్శి కందగట్ల సురేందర్, తాండ్ర వెంకటేశ్వర రావు, హెచ్ పి ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాతంగి సంతోష్ తదితర కార్మిక సంఘాల ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.